క్లుప్తంగా

వయోవృద్ధులతో ప్రేమతో మెలగాలి



వయో వృద్ధులను సన్మానించిన పాస్టర్లు

పాములపాడు: ప్రతి ఒక్కరూ వయో వృద్ధుల పట్ల ప్రేమతో మెలగాలని పాస్టర్ రెవరెండ్ వేల్పుల ప్రసాద్ బాబు అన్నారు. ఆదివారం స్థానిక సీఎస్ఐ చర్చిలో వయో వృద్ధులను సన్మానించారు. ఆయన మాట్లాడుతూ ఒక రిపై ఒకరికి ప్రేమ, దయ, కరుణ, గుణము కలిగి తల్లిదండ్రులను సన్మానించాలన్నారు. ఏసు ప్రభువు ప్రేమించినట్లుగానే అందరూ అందరిని గౌరవించాలని చెప్పారు.

మహానందిలో తగ్గిన రద్దీ



మహానందీశ్వరుడి దర్శనార్థం వేచి ఉన్న భక్తులు

మహానంది: సాధారణంగా వీకెండ్, ఆది, సోమవారాల్లో భక్తులతో మహానంది ఆలయం కళకళలాడుతుంటుంది. అయితే ప్రస్తుతం మహాలయ పక్షాలు కావడంతో ఆలయానికి వచ్చే భక్తుల సంఖ్య గణనీయంగా తగ్గింది. దీంతో ఆదివారం పలు ప్రాంతాలకు చెందిన కొద్ది మంది భక్తులు మహానందికి చేరుకుని శ్రీకామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి వారిని దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు చేశారు. ఉదయం, సాయంత్రం జరిగిన అష్టవిధ మహామంగళ హారతి పూజలు వైభవంగా జరిగాయి.

గంగలో చేపల వేట



అయ్యన్ననగర్ వద్ద తెలుగు గంగలో చేపలు పడుతున్న యువకులు

మహానంది: తెలుగు గంగ కాల్వ నీటితో కళకళ లాడుతోంది. ఎగువ ప్రాంతాల నుంచి నీరు పుష్కలంగా వస్తుండటంతో జలకళ సంతరించుకుంది. కొత్తనీరు రావడంతో చేపలు సైతం పుష్కలంగా దొరుకుతున్నాయి. ఈ క్రమంలో మహానంది సమీపంలోని అయ్యన్ననగర్ వద్ద కొందరు యువకులు గాలాలతో చేపలు పడుతూ ఆదివారం ఇలా కనిపించారు.

సీఐని కలిసిన యాదవ నాయకులు



సీఐని సన్మానిస్తున్న యాదవ మహాసభ నాయకులు

ఆత్మకూరు: పట్టణ సీఐ ఓబులేసును ఆదివారం అఖిలభారత యాదవ మహాసభ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువా కప్పి బొకే అందజేశారు. పట్టణంలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేయాలని, అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. నాయకులు రఘురాముడుయాదవ్, బాలస్వామియాదవ్, శివరామకృష్ణయాదవ్, శేఖర్‌యాదవ్ ఉన్నారు.

వానరానికి అంత్యక్రియలు

నందికొట్కూరు: పట్టణంలోని పటేల్ సెంటర్‌లో రోడ్డు దాటుతూ బొలెరో వాహనం ఢీకొని మృతి చెందిన వానరానికి ఆదివారం అంత్యక్రియలు నిర్వహించారు. చౌడేశ్వరిదేవి సేవ సమితి ఆధ్వర్యంలో పూజలు చేసి పూడ్చిపెట్టారు. అంత్యక్రియల్లో సమితి సభ్యులు డాక్టర్ దేశెట్టి శ్రీనివాసులు, అరుణ్, నారాయణ, రవి, జగదీష్, వంశీ, అంజి పాల్గొన్నారు.

12వ పీఆర్‌సీని నియమించాలి

ఆత్మకూరు: ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించి 12వ పీఆర్‌సీని వెంటనే నియమించాలని గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు జవహర్ నాయక్ అన్నారు. ఆదివారం పట్టణంలోని అంబేడ్కర్ భవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ 12వ పీఆర్‌సీ కమిషన్‌ను నియమించి 30 శాతం మధ్యంత భృతి(ఐఆర్) ప్రకటించి అమలు చేయాలన్నారు. పెండింలో ఉన్న పాత ఆర్థిక బకాయిలు, ఉద్యోగ ఉపాధ్యాయులకు వెంటనే చెల్లించాలన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులపై పెట్టిన పాత కేసులన్నీ ఎత్తి వేయాలని, ఉపాధ్యాయుల బోధనకు ఆటంకం కలిగించే వివిధ రకాల యాప్‌లను తొలగించాలన్నారు. సీపీఎస్‌పై సకాలంలో తగిన నిర్ణయం తీసుకోవాలని, గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులను దృష్టిలో ఉంచుకొని కనీసం పదో తరగతి వరకు తెలుగు, ఆంగ్లం రెండు మాధ్యమాల్లో విద్యాబోధన జరిగేటట్లు చూడాలన్నారు. కరోనాతో మరణించిన ఉద్యోగ, ఉపాధ్యాయుల కుటుంబాలను ఆదుకోవాలన్నారు.

మిర్చిరైతుకు ధరాఘాతం

- భారీగా పడిపోయిన మిర్చి ధరలు
- 12 కేజీలు రూ.130లకు వ్యాపారుల కొనుగోలు
- పెట్టుబడులు చేతికందడం లేదని అన్నదాతల ఆవేదన
- గిట్టుబాటు కాక పంటను దున్నేసిన రైతులు



గిట్టుబాటు ధరలేక మిరప పంటను దున్నేస్తున్న రైతు

జూపాడుబంగ్లా: ధరాఘాతంలో మిర్చి రైతులు విలవిల లాడిపోతున్నారు. పంటసాగు చేసిన మొదట్లో పచ్చిమిర్చి మనుము రూ.350లు పైబడి ధరపలకడంతో రైతులు ఈ ఏడాది తమ అప్పులు తీరినట్లేనని ఆశపడ్డారు. అయితే దిగుబడులు చేతికందే సరికి పచ్చిమిర్చి ధరలు అమాంతం తగ్గిపోవటంతో రైతులు కలవరపడుతున్నారు. పెట్టుబడులు కూడా చేతికందే పరిస్థితి లేదని దిగాలు చెందుతున్నారు. కొందరు చేసిదిలేక పంటలను దున్నేస్తున్నారు. గిట్టుబాటు ధరలు కల్పించి రైతులను ఆదుకోవాల్సిన ప్రభుత్వం రైతుల సంక్షేమం గురించి పట్టించుకోకపోవటంతో పాటు ఇప్పటిదాకా పెట్టుబడి సహాయం అందించకపోవడంతో రైతులు కూటమి ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శిస్తున్నారు.

1,850 ఎకరాల్లో పచ్చిమిర్చి సాగు

మండలంలోని తంగడంచ, తర్తూరు, మండ్లెం, తరిగోపుల, పి.లింగాపురం, 80బన్నూరు, భాస్కరాపురం తదితర గ్రామాల్లో ఖరీఫ్ సీజన్‌కుగాను 1,850 ఎకరాల్లో పచ్చిమిర్చి పంటను రైతులు సాగు చేశారు. ఈ నెల మొదటి వారంలో మడుము (12కిలోల)ధర రూ.70లకు వ్యాపారులు కొనుగోలు చేయడంతో రైతులు పంట కోసం చేసిన అప్పులు ఎలా తీర్చాలా అని ఆవేదనకు లోనవుతున్నారు. ప్రస్తుతం మడుము పచ్చిమిర్చి రూ.130లకు వ్యాపారులు కొనుగోలు చేస్తుండగా బహిరంగ మార్కెట్లో వ్యాపారులు కిలో పచ్చిమిర్చి రూ.40ల చొప్పున విక్రయిస్తున్నారు.

ఎకరాకు రూ.లక్షల పెట్టుబడి

ఎకరా పచ్చిమిర్చి సాగుకు రూ.లక్షల పెట్టుబడి అవుతుండగా మిరపకాయలు తెంపటానికి ఓ కూలీకి రోజుకు రూ.250లు చెల్లిస్తున్నారు. అయితే దిగుబడి ఆశజనకంగా ఉన్నా గిట్టుబాటు ధరల్లేక పంటకోసం చేసిన అప్పులు తీరేపరిస్థితి లేక చివరికి మిర్చి రైతులు నష్టాలను భరించలేక పంటలను దున్నేస్తున్నారు. కొంత మంది రైతులు ఏపుగా ఉన్న పంటను చేజేతులా దున్నేయలేక నష్టాల ఊబిలోనే వ్యవసాయం కొనసాగిస్తున్నారు.



తెంపిన మిరపకాయలను కుప్పగా పోస్తున్న రైతు

గిట్టుబాటు ధరలు కల్పించాలి



నేను 1.50 ఎకరా పొలాన్ని కౌలుకు తీసుకొని పచ్చిమిర్చి సాగు చేశా. కౌలు రూ.30వేలతో పాటు ఎకరాకు రూ.లక్ష చొప్పున ఇప్పటిదాకా పంట సాగుకు వెచ్చించాను. ఇప్పటిదాకా మూడు కోతల పంటను కోశాను. మొదటి కోత మడుము రూ.70లకు, రెండోకోత రూ.100లకు, ప్రస్తుతం మూడో కోత రూ.130లకు విక్రయించా. పెట్టిన పెట్టుబడులు చేతికందడం లేదు. ఏపుగా ఉన్న పంటను దున్నేయలేక అప్పులవుతున్నా అలాగే నెట్టుకొస్తున్నాను.

– వెంగన్న, మిర్చి రైతు, తంగడంచ

నష్టం రావడంతో పంటను దున్నేశా



రూ.40వేలు కౌలు చెల్లించి రెండు ఎకరాల్లో జూన్ 6న పచ్చిమిర్చి వేశాను. పంట ఆశాజనకంగా ఉండటంతో ఈ ఏడాది కష్టాలు తీరుతాయనుకున్నాను. అయితే గిట్టుబాటు ధరల్లేని కారణంగా నా కష్టాలు మరింతగా పెరిగాయి. రూ.300లు కూలీ చెల్లించి తెంపిన పచ్చిమిర్చిని వ్యాపారులు మడుము కేవలం రూ.70 నుంచి రూ.90లకు మాత్రమే కొనుగోలు చేస్తున్నారు. దిగుబడి ఆశాజనకంగా ఉన్నా నష్టం వస్తుండటంతో చేసేదిలేక పంటను దున్నేశాను. దీంతో నాకు రూ.3లక్షల మేర పంటనష్టం వాటిల్లింది.

– మనోహర్‌రెడ్డి, మిర్చిరైతు, జూపాడుబంగ్లా

పది నిమిషాలకోసారి బ్రేక్‌డౌన్

జూపాడుబంగ్లా: జూపాడుబంగ్లా విద్యుత్ ఉపకేంద్రంలోని 80 బన్నూరు ఫీడర్ పది నిమిషాలకోమారు బ్రేక్‌డౌన్ అవుతుండటంతో విద్యుత్ వినియోగదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత మూడు రోజుల నుంచి 80బన్నూరు ఫీడర్‌లో నెలకొన్న సమస్యలు పరిష్కరించడంలో ట్రాన్స్‌కో అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. దీంతో పదినిమిషాలకో పర్యాయం లైన్ బ్రేక్‌డౌన్ అవుతుండటంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడి గృహ విద్యుత్ వినియోగదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఫీడర్ కింద తాటిపాడు, 80బన్నూరు, పోతులపాడు, చాబోలు గ్రామాలున్నాయి. ఆయా గ్రామాల్లో 1,250 గృహవిద్యుత్ వినియోగదారులున్నాయి. మూడు రోజుల నుంచి పగలు, రాత్రి అనే తేడాల్లేకుండా విద్యుత్ సరఫరాలో నిలిచిపోతుండటంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ట్రాన్స్‌కో అధికారులు స్పందించి సత్వరమే సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

మహానందిలో యువకుల మధ్య ఘర్షణ

మహానంది: మహానందిలో ఆదివారం సాయంత్రం యువకుల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. మహానందికి చెందిన తేజ, బద్వేలుకు చెందిన సుమంత్, శివల మధ్య వివాదం చోటు చేసుకోవడంతో ఘర్షణకు దారితీసింది. ఆలయం వెనుక ఉండగా ఇరువర్గాల వారు వాదోపవాదాలకు దిగి గొడవ పడ్డారు. వెంటనే స్థానికులు పోలీసుల దృష్టికి తీసుకెళ్లడంతో ఏఎస్ఐ రామకృష్ణ ఘటనా స్థలానికి చేరుకుని ఇరు వర్గాలను స్టేషన్‌కు తీసుకెళ్లి విచారణ చేస్తున్నారు.

అంతర పంట.. అదనపు ఆదాయం



పసుపు పంట చుట్టూ కంది సాగు

మహానంది: మహానంది మండలంలో ప్రధానంగా సాగు చేస్తున్న పంటల్లో అరటి ముఖ్యమైంది. అయితే ప్రతి ఏడాది అకాల వర్షాలు, భీకర గాలులతో రైతన్నలు తీవ్రంగా నష్టపోతున్నారు. దీంతో అరటి సాగు చేసే రైతులు వినూత్నంగా ఆలోచిస్తున్నారు. అందులో భాగంగా అరటిలో అంతర పంటలను సాగు చేస్తూ అదనపు ఆదాయం పొందేందుకు ప్రయత్నాలు ఆరంభించారు. ఈ క్రమంలో అరటితోటలో బంతిపూలతో పాటు వివిధ రకాల ఆకు, కూరగాయలను సాగు చేస్తున్నారు. మరికొందరు రైతులు, పసుపు సాగు చేస్తున్న రైతులు పంట పొలాల చుట్టూ గట్ల వెంట కంది పైరును పండిస్తున్నారు.



అరటిలో అంతర పంటగా బంతి పూలసాగు

వేటగాళ్ల ఉచ్చుకు అడవిపంది బలి

కొత్తపల్లి: సింగరాజు పల్లె గ్రామం పొలాల సమీపంలో వేటగాళ్లు ఏర్పాటు చేసిన ఉచ్చులకు ఓ అడవి పంది బలి అయింది. ఫారెస్ట్ రేంజ్ అధికారి పట్టాభి, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ జ్యోతి స్వరూప్ తెలిపిన వివరాల మేరకు.. సింగరాజు పల్లె శివారులో పొలాలకు వెళ్లే దారిలో కొందరు గుర్తుతెలియని వ్యక్తులు అడవి పందులను వేటాండేదుకు ఆదివారం ఉచ్చులు వేశారు. ఒక అడవి పంది ఆ ఉచ్చులో పడటంతో దానిని గ్రామంలోకి తీసుకెళ్లి విక్రయాలు జరిపేందుకు సిద్ధమయ్యారు. సమాచారం అందుకున్న అటవీ అధికారులు అక్కడికి వెళ్లగానే వేటగాళ్లు పసిగట్టి పరారయ్యారు. ఘటన ప్రదేశంలో వదిలేసి వెళ్లిన కళేబరాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించి నిందితుల కోసం గాలిస్తున్నట్లు ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ వెల్లడించారు.



విక్రయించేందుకు కాల్చిన అడవి పంది కళేబరం

నిత్యావసర ధరలు తగ్గించాలని నిరసన

ఆత్మకూరు: దసరా పండుగకు ముందు నిత్యావసర సరుకులు, కూరగాయల ధరలు సామాన్యుడికి పెనుభారంగా మారిందని.. వెంటనే తగ్గించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు వి.ఏసురత్నం, పట్టణ కార్యదర్శి ఎ.రణధీర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం ఆత్మకూరు ఆర్టీసీ బస్టాండ్ ఎదుట ప్రభుత్వానికి వ్యతిరేకంగా ధర్నా నిర్వహించారు. ఇంట్లో వాడే సబ్బుల నుంచి నూనె, గోధుమపిండి ఇలా ప్రతి వస్తువు ధర పెరిగిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. సామాన్యుడు కొనే పరిస్థితిలో లేరన్నారు. ధరలను నియంత్రించడంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని మండిపడ్డారు. వెంటనే ధరలను తగ్గించేలా చర్యలు తీసుకోవాలన్నారు. సీపీఎం నాయకులు సురేంద్ర, నాగేశ్వరరావు, వీరన్న, తుమ్మలూరు శివకుమార్, మహమ్మద్, భాస్కర్, రాజేష్, గణపతి, నబీ, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



ఆర్టీసీ బస్టాండ్ ఎదుట ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

ఆలయాల వద్ద సీసీ కెమెరాల ఏర్పాటు

కొత్తపల్లి: మండలంలోని ఆయా గ్రామాలలోని ఆలయాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు దుద్యాల దేవాదాయ శాఖ ఈఓ కార్తీక్ ఆదివారం తెలిపారు. అనంతపూరం జిల్లా కనేకల్ మండలంలోని అనకనహల్ గ్రామంలోని ఆలయంలో రాములవారి రథానికి గుర్తుతెలియని దుండగులు నిప్పు పెట్టారు. ఆ ఘటనను దృష్టిలో ఉంచుకొని దేవదాయ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆలయాలు, రథాలకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. అందులో భాగంగానే మండలంలోని గువ్వకులంట్ల గ్రామంలోని ఈశ్వరస్వామి ఆలయం, కొత్తపల్లి శ్రీ తాండవమల్లేశ్వరస్వామి ఆలయం, దుద్యాల గ్రామంలోని మల్లేశ్వరస్వామి, ఆంజనేయ స్వామి ఆలయాలు, రథాలకు సుమారు రూ.60వేలు ఖర్చుచేసి సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని వెల్లడించారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే చర్యలు

పాములపాడు: బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే చర్యలు తప్పవని ఎస్ఐ సురేష్ బాబు హెచ్చరించారు. ఆదివారం స్థానిక పోలీసు స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడుతూ ఇప్పటికే బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్న పలువురిని పట్టుకొని జరిమానాలు విధించామన్నారు. మొదటి సారి జరిమానాతో సరిపెట్టామని, మరో సారి పట్టుపడితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. .

కేజీ రోడ్డు పై వాహనాల తనిఖీ

స్థానిక పోలీసు స్టేషన్ ఎదుట కేజీ రోడ్డు పై వాహనాల తనిఖీ చేపట్టారు. వాహన చోదకుల నుంచి వాహనాలకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలు పరిశీలించారు. సరైన పత్రాలు లేని వారికి జరిమానా విధించారు.

పూర్వ విద్యార్థులు తరలిరండి

నందికొట్కూరు: గవర్నమెంట్ హైస్కూల్‌లో అక్టోబర్ 2వ తేదీన పూర్వవిద్యార్థుల (80 ఏళ్ల) కలయిక నిర్వహిస్తున్నట్లు గాంధీ మెమోరియల్ పూర్వ విద్యార్థుల కమిటీ అధ్యక్షులు అల్వాల బాల వెంకట సురేష్ తెలిపారు. ఆదివారం పట్టణంలోని శారద లాడ్జింగ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అక్టోబర్ 2న గాంధీ జయంతి సందర్భంగా 1946–2024 వరకు విద్యనభ్యసించిన వారందరూ కార్యక్రమానికి తరలిరావాలని కోరారు. ఆ రోజు మున్సిపల్ కార్యాలయం నుంచి గవర్నమెంట్ హైస్కూల్ వరకు ర్యాలీ నిర్వహిస్తునట్లు చెప్పారు. సంతపేట ఎంపీపీ స్కూల్, గవర్నమెంట్ హైస్కూల్‌కు తమవంతు సహాయ సహకారాలు అందజేస్తామన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్న ప్రతి ఒక్కరూ మౌలిక వసతులు కల్పించేందుకు సహాయం అందించేందుకు ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు.

తగ్గిన నీటి విడుదల

జూపాడుబంగ్లా: ఎస్సార్బీసీ, తెలుగుగంగ కాల్వలకు అనుసంధానంగా ఉన్న రిజర్వాయర్లు నిండటంతో పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ నుంచి నీటి విడుదలను తగ్గించినట్లు ఏఈ విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ హెడ్‌రెగ్యులేటర్ నుంచి 13 వేల క్యూసెక్కుల నీటిని ఎస్సార్‌ఎమ్సీలోకి సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. ఈ నీటిని బానకచర్ల నీటినియంత్రణ వ్యవస్థ నుంచి తెలుగుగంగ కాల్వకు 10వేలు, కేసీ ఎస్కేప్ కాల్వకు 3 వేల క్యూసెక్కుల చొప్పున వదులుతూ ఎస్సార్బీసీకి పూర్తిగా నిలిపివేసినట్లు వెల్లడించారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

రుద్రవరం: మండల పరిధిలోని రెడ్డిపల్లె మెట్ట వద్ద రెండు వాహనాలు ఢీకొనడంతో మంగలక్ష్మి, దుర్గాలక్ష్మి, వీరవేణి తీవ్రంగా గాయపడ్డారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఒరిస్సాకు చెందిన భక్తులు టెంపో ట్రావెల్స్‌లో అహోబిలం లక్ష్మీ నరసింహ స్వామిని దర్శించుకుని రుద్రవరం మీదుగా కోటప్పకు కొండకు వెళ్తున్నారు. రెడ్డిపల్లె సమీపంలోకి రాగానే పొలంలో నుంచి మిర్చీ లోడుతో రోడ్డెక్కుతున్న లారీ... టెంపో ట్రావెల్స్‌ను ఢీకొట్టింది. ఆ ప్రమాదంలో ముగ్గురు మహిళలు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను వెంటనే రుద్రవరంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించి ప్రథమ చికిత్స చేయించినట్లు గ్రామస్తులు తెలిపారు.

నృత్యార్చన

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఆలయ దక్షిణ మాడ వీధిలోని నిత్యకళావేదికపై నెల్లూరుకు చెందిన వెంకటేశ్వర ఆర్ట్స్ అకాడమీ వారిచే నిర్వహించిన నృత్య ప్రదర్శన భక్తులను అలరించింది. గణపతి స్తుతి, చంద్రమూడ శివశంకర పార్వతి, శివతాండవ స్తోత్రం, ఓంకారనాథం, నమఃశివాయ, అఖిలాండేశ్వరి తదితర గీతాలకు మీనాక్షి, కీర్తి, వైష్ణవి, శ్రావణి, భువనేశ్వరి, భవ్య, తేజస్విని, హర్షిణి, చక్రీక, పూర్విత, నాగరిశ్వక, గీతిక, మేఘన, శరణ్య, శిరీష, దర్శిని తదితరులు నృత్య ప్రదర్శన చేశారు.



శివతాండవం

మద్యం విక్రేతల అరెస్ట్

డోన్ రూరల్: మండల పరిధిలోని గోసానిపల్లి గ్రామంలో మద్యం విక్రయిస్తున్న ఇద్దరిని ఆదివారం అరెస్టు చేసినట్లు రూరల్ సీఐ రాకేష్ తెలిపారు. ఎస్పీ ఆదేశాల మేరకు గోసానిపల్లి సమీపంలోని సుంకులమ్మ ఆలయం వద్ద మద్యం విక్రయిస్తున్నారనే సమాచారంతో దాడులు నిర్వహించామన్నారు. డోన్ మండలం వెంకటనాయునిపల్లి గ్రామానికి చెందిన శీలం రాజశేఖర్, నక్కలవాగుపల్లి గ్రామానికి చెందిన షేక్ మౌలాలి, ధర్మవరం గ్రామానికి చెందిన వినీత్ కుమార్‌రెడ్డి గోవా నుంచి ఆటోల్లో మద్యం తీసుకొచ్చి గ్రామాల్లో అధిక ధరలకు అమ్ముతున్నట్లు గుర్తించామని తెలిపారు. శీలం రాజశేఖర్, షేక్ మౌలాలీలను అదుపులోకి తీసుకోగా వినీత్‌కుమార్‌రెడ్డి పారిపోయాడని తెలిపారు. వారి వద్ద నుంచి హేవార్డ్స్ 528 బాటిళ్లు, రాయల్‌స్టాగ్ 24 బాటిల్స్, మ్యాన్షన్ హౌస్ 18 బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామని వెల్లడించారు. ముగ్గరిపై కేసు నమోదు చేశామన్నారు. పరారీలో ఉన్న వ్యక్తి కోసం గాలింపు చర్యలు చేపట్టామని తెలిపారు.

మున్సిపాలిటీలో అవినీతిపై విచారణ చేయించాలి



మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

నందికొట్కూరు: మున్సిపాలిటీ కార్యాలయంలో జరిగిన అవినీతిపై సీబీఐతో విచారణ చేయించాలని సీపీఎం నాయకులు నాగేశ్వరరావు, పక్కీర్‌సాహెబ్ డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. మున్సిపాలిటీలో ఎవరికి ఇష్టం వచ్చినట్లు వారు తీర్మానాలు చేసి దోచుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలను గాలికి వదిలేసి మున్సిపల్ సాధారణ సమావేశాల్లో మా అజెండాలు తీర్మానాలు చేయాలంటూ అధికారులపై ఒత్తిళ్లు తేవడంపై ప్రజాప్రతినిధులపై ప్రజలు మండిపడుతున్నారని చెప్పారు.

ముచ్చుమర్రిలో సీసీ కెమెరాల ఏర్పాటు



పాత ముచ్చుమర్రిలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయిస్తున్న ఎస్ఐ శరత్‌కుమార్‌రెడ్డి

పగిడ్యాల: మండలంలోని పాత, కొత్త ముచ్చుమర్రి గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు ఎస్ఐ సి. శరత్‌కుమార్‌రెడ్డి ఆదివారం తెలిపారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు రెండు గ్రామాల్లో 20 కెమెరాలను అమర్చినట్లు వెల్లడించారు. అయితే ఇటీవల ముచ్చుమర్రి గ్రామంలో చోటుచేసుకున్న వరుస ఘటనల నేపథ్యంలోనే పోలీసులు సీసీ కెమెరాలను ఏర్పాటు చేయించినట్లు గ్రామంలో చర్చించుకుంటున్నారు. జూలై 7న కొత్త ఎల్లాల గ్రామానికి చెందిన మైనర్ బాలిక అత్యాచారానికి గురై హత్య గావింపబడడం రాష్ట్ర వ్యాప్తంగా సంచలనమైంది. అయితే ఇప్పటి వరకూ ఆ బాలిక మృతదేహం పోలీసులకు లభ్యం కాలేదు. ఈ ఘటనను మరువక ముందే గ్రామంలో ఓ బడా నేత కేసీ కాలువల తూమును మూయించి నీటి రాజకీయానికి తెరలేపడం, అలాగే గ్రామానికి చెందిన శ్రీనివాస గౌడ్ ఇంటికి తాళం వేయించి కుటుంబీకులను రోడ్డుపై నిలబెట్టడం.. ఇలాంటి ఘటనలు పోలీసులకు తలనొప్పిగా మారాయి. దీంతో అప్రమత్తమైన జిల్లా యంత్రాంగం గ్రామంలో పోలీసు ఫండ్ రూ.లక్షతో సీసీ కెమెరాల ఏర్పాటుకు నడుం బిగించడం చర్చనీయాంశమైంది. గ్రామంలో చీమ చిటుక్కుమన్నా పోలీస్ స్టేషన్ నుంచే మానిటరింగ్ చేసేందుకు పోలీసులు కట్టుదిట్టమైన నిఘా వ్యవస్థను ఏర్పాటు చేసుకున్నారు.


జాగ్రత్తగా డ్రైవింగ్ చేయాలి

నందికొట్కూరు : ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా డ్రైవింగ్ చేసి ప్రమాదాలకు గురికాకుండా సురక్షితంగా గమ్యం చేసుకోవాలని ఆత్మకూరు డీఎస్పీ రామాంజినాయక్ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని బ్రాహ్మణకొట్కూరు గ్రామ సమీపంలో రాయల ఫంక్షన్ హాల్‌లో వివిధ వాహనదారుల డ్రైవర్లకు సురక్షిత డ్రైవింగ్‌పై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ డ్రైవర్లు ప్రశాంతంగా వాహనాలను నడపాలన్నారు. మనసంతా డ్రైవింగ్‌పై ఉంచి నడిపితే ఎలాంటి ప్రమాదాలు జరగవని చెప్పారు. డ్రైవర్‌పై కుటుంబం ఆధారపడి ఉంటుందని గుర్తించుకోవాలని తెలిపారు. ద్విచక్ర వాహనదారులు కచ్చితంగా హెల్మెట్ ధరించాలని సూచించారు. ఆటో డ్రైవర్లు ఓవర్ లోడుతో స్పీడ్‌గా నడిపి ప్రమాదాలకు గురవుతున్నారని, నిదానంగా నడిపి సురక్షితంగా ప్రయాణికులను గమ్యానికి చేర్చాలని సూచించారు. కార్యక్రమంలో రూరల్ సీఐ సుబ్రహ్మణ్యం, బ్రాహ్మణకొట్కూరు ఎస్ఐ తిరుపాలు తదితరులు పాల్గొన్నారు.



ఆత్మకూరు డీఎస్పీ రామాంజినాయక్

చరిత్రకు పచ్చని ఛత్రం



బురుజును కప్పేసిన తీగలు

పాములపాడు : మండలంలోని ఇస్కాల గ్రామంలో చరిత్రకు సాక్షంగా నిలుస్తోంది పురాతన బురుజు. దాదాపు 310 సంవత్సరాల క్రితం పాలెగాళ్ల రాజ్యం కాలంలో నిర్మించిన పురాతన బురుజు హరిత వర్ణంతో శోభాయమానంగా దర్శనమిస్తోంది. ఈ బురుజుపై పెరిగిన తొట్ల కాయల మొక్కలు తీగలుగా విస్తరించి బురుజును కప్పివేశాయి. తోరణాల్లా కిందకు వేలాడుతూ మరింత అందంగా కనిపిస్తున్నాయి. ఎండా కాలంలో కూడా ఈ చెట్టు ఇలాగే ఉండటం విశేషం. 8 సంవత్సరాల క్రితం బురుజు చుట్టుపక్కల ఉన్న పూరి గుడిసెలు ప్రమాదవశాత్తు నిప్పంటుకున్న సమయంలో బురుజుపై ఉన్న ఈ చెట్టు కూడా కాలిపోయింది. అయినప్పటికీ మళ్లీ చిగురించింది. ఇటీవల కురిసిన వర్షాల వల్ల బురుజుకు గొడుగులా విస్తరించి హరిత వర్ణంలో కళకళలాడుతోంది. పశువుల వైద్యంలో ఈ ఆకును వినియోగిస్తారని రైతులు తెలిపారు. ఈ బురుజుకు గోడ మధ్యలో ఓ చిన్న గూడులా ఏర్పాటు చేసి అందులో ఆంజనేయ స్వామి ప్రతిమను ప్రతిష్ఠించారు. నేటికీ అక్కడ పూజలు నిర్వహిస్తూనే ఉన్నారు. కోట నిర్మాణం అంతా మట్టి, రాయితో చేపట్టారు. శతాబ్దాలు గడిచినా చెక్కుచెదరకుండా దర్శనమిస్తున్న ఈ బురుజు నిర్మాణం ఆనాటి కట్టడాల నాణ్యతను, చరిత్రను తెలియజేస్తుంది. అప్పట్లో ప్రజలు ధన, దాన్యాలు ఇందులో దాచుకొని గ్రామంలో కరువు కాటకాలు సంభవించినప్పుడు వాడుకునే వారని గ్రామస్తులు తెలిపారు.



బురుజు గోడలో ఏర్పాటు చేసిన ఆంజనేయ స్వామి ప్రతిమ